
చెరకురసం తెచ్చి గూనలో పోసి ఆ ఖాళీ బకెట్‌తో నుంచున్నాడు చిన్నోడు. బెల్లంపొయ్యి దగ్గర మంట కాగుతున్నాడు జగ్గన్న. సెగ వెచ్చగా

# శత్రువు



శ్రీపతి

వంటికి పట్టున్నది. నిద్రమత్తుకి కళ్ళు బరువుగా పడిపోతున్నాయి. ఇన్నావురా అని జగ్గన్న అడిగితే— దేన్ని గురించో చిన్నోడికి అర్థం కాలేదు. జగ్గన్న కళ్ళల్లోకి చూస్తూ నుంచున్నాడు.

చాలా సేపు ఊపిరి కూడదీసుకుంటున్నట్టుగా పెదవి కదపకుండా కూచున్న తర్వాత 'ఆ గుంట సచ్చిపోతాడా. అది మరి బతకదు. మంకుపట్టుపట్టేసింది. ఏడినేడిని సగమయిపోయింది. అదింక బతకదు సిన్నోడా సచ్చిపోతాది'నోటిలో చుట్టతీసి పొగవదులుతూ అన్నాడు జగ్గన్న. ఎర్రటిమంట జగ్గన్న ముడతల ముఖంమీద, నెరుస్తున్న జుత్తుమీద కెరటాల్లాగ పడుతున్నది.

'చిన్నోడా చెరుకు మోపెయ్యిరో.' మెషిన్ దగ్గర కూచుని చెరుకు కుడుపుతున్న జంగమయ్య అరిచాడు.

చిన్నోడు బకెట్ అక్కడుంచేసి పందిరికి ఉత్తరపక్క పడున్న చెరుకు మోపుని తెచ్చి మెషిన్ దగ్గరవేసి మళ్ళీ వచ్చి బెల్లంపొయ్యిదగ్గర నుంచున్నాడు.

పొయ్యిలోకి చెరకు తొక్కువేస్తున్న చొట్టోడికి జగ్గన్న ఏం చెపుతున్నాడో వినిపించలేదు. వాడు పందిరిబయట దక్షిణపక్క కూచున్నాడు. పందిరి తడిక సందుల్లోంచి జగ్గన్న అయితే కనిపిస్తున్నాడు కాని మాట సరిగ్గా వినిపించటంలేదు.

మా గనమయిన అల్లుడికి సేసినాడు పెళ్ళి, ముందు ఎనకా ఆలోసించకుండా. ఆ అల్లుడు గుంటడికి వాటూ వరసా ఉన్నాయిరా. సిన్నా పెద్దా ఉన్నాదిరా. ఆడితో ఏ గుంటయినా కాపరం సేయ గలుగుతాదిరా. ఆడికున్న రోగాల్తో ఆడు సవ్వడం సంగతటుంచు బంగారంలాంటి పిల్ల ఇదెన్నాళ్ళు వేణంతో బతుకుతాదంటావ్. ఊళ్లో ఉన్న లంజకొడుకుయిాడికే కళ్ళు కనబడలేదు. పొరుగూరోడికి యింకేం కనబడతాది. అయినా డబ్బు మాయున్నాది సూడూ దాని ముందు పెపంచకం యింకేం కనబడవురా సిన్నోడా. నరసయ్యకళ్ళకి ఆడబ్బు, మనకలు కప్పేలసింది. పెద్దింటోడు. ఒక్కడే కొడుకు. ఆడి పొలాలు, ఆడి ఆస్తి, ఆడి మేడిల్లు, ఆడి ఇంట్లోని బంగారం సరుకులు, ఆడి డబ్బు, ఆడి యాపారం. మరింకేవీ కనబళ్లేదు. మంచీ చెడ్డా కనబడ్లేదు. పరువూ పెతిష్టా కనబడ్లేదు. డబ్బుమాయ కళ్ళకి పొరలు కొట్టేసింది. ఆ గుంట బంగారు బొమ్మలాంటి గుంట బతుకు బుగ్గయిపోయింది.' జగ్గన్న నొచ్చుకున్నాడు.

అన్నం తింటానికి ఇంటికి వెళ్ళినప్పుడు సుభద్రని చూసాడు. ఐదారు దినాలవుతున్నది ఆ పిల్ల తిండి తినకుండా బల్లిలాగ మంచానికి అంటుకుని పడుకున్నది. ఆ పిల్లని చూసొచ్చిన బాధ ఇంకా వెంటాడుతున్నది. ఆ పెళ్ళిమాట

వచ్చినప్పుడే జగ్గన్న బాధపడ్డాడు. డబ్బుకోసం గడ్డితినకురా అనిచెప్పాడు నర్సయ్యతో. నర్సయ్య విన్లేదు.

పొయిలో మంట తగ్గడం చూసాడు చిన్నోడు. 'అయిందిరా పనీ. ఓర్ చొట్టోడా...తొక్కెయ్యిరో.' విసుక్కుని అరిచాడు.

చొట్టోడుకి ఒకకాలు ఊచకాలు. ఆడు కూచుని ఎంతపనయినా ఎంత సేవయినా చేయగలడు. రాత్రంతా బెల్లం వంట. పొయ్యిలోకి ఆపకుండా తొక్కెయ్యాలి. పగలు ఎండలో పని సాగదు. అంచేత రాతిరంతా గానుగపని సాగుతుంది. బయట ఎడ్లు గానుగ తిరుగుతున్నాయి. మెషిన్‌లోకి జంగమయ్య చెరకు కుడుపుతున్నాడు. ధారగా రసం కింద గోతిలో పెట్టిన బకెట్‌లో పడుతున్నది. మెషిన్ కిర్రూ కిర్రూ రాగాలు తీస్తున్నది. ఎడ్లను తోలుతున్న దాసుకి జగ్గన్నతాత గొంతు వినిపించింది. అక్క ఒకరోజున 'నాకా పెళ్ళి సెయ్యడంకన్న ఉరిపోసి సంపేస్తే నీకు పున్నెంరా అయ్యా' అని ఏడ్చింది. ఆ మాటలు దాసుకు గుర్తొచ్చాయి. అయ్య-అక్కను కొట్టుంటే ఏడుపొచ్చింది. ఇంకొంచెం పెద్దయితే అయ్యని పట్టుకుని కొట్టాలి అనిపించింది. అమ్మ నోరుమూసుకుంటుంది. దానికీ భయమే తను చదువుకోవాలంటే, వొద్దురా మనకా చదువు లబ్బవురా అని చదువు మాన్పించి వ్యవసాయంలో పెట్టాడు. అన్నీ గుర్తుతెచ్చుకుని ఎడ్లవెనక నడుస్తున్నాడు దాసు.

జగ్గన్న చెప్పిందంతా చిన్నోడు ముందే విన్నాడు. చిన్నోడికి సుభద్ర అంటే ఆ ఇంట్లో మనుషులందరికంటె ఇష్టం. నర్సయ్య కంబారిగా వాడు పద్నాలుగో ఏట చేరాడు. పదేళ్ళు గడిచాయి. ఇంకా ఆ పిల్లకి కంబారోడ్ని దూరంగా చూడాలనే బుద్ధి రాలేదు. చిన్నన్నా చిన్నన్నా అంటుంది. అలా కంబారోడ్ని ఎవరూ పిలవరు. దానీ ఇష్టం లేకుండా పెళ్ళిచేసినప్పుడే చిన్నోడు బాధపడ్డాడు. అందరూ అనుకున్నట్టే ఆ పిల్లకి- పెద్దింటివాళ్ళబ్బాయి తగినోడు కాదని అనుకున్నాడు. ఇప్పుడు జగ్గన్న ఈ మాట చెప్పిన తర్వాత ఆ పెద్దింటి సంపదకి నర్సయ్య కక్కుర్తిపడ్డాడనిపించింది.

'అంతా అయిపోద్దానికి ఇప్పుడేం చేయాల్రాతా—ఇకన మనను మెత్తన సేనుకోవాల్తప్ప. ఆ మూడు ముళ్ళూ పడకముందయితే—'

సుభద్ర మూణ్నాళ్ళ్నించి తిండితిన్లేదని వింటున్నాడు. ఆ పిల్ల మనసు ఎవరెన్ని చెప్పికూడా మార్చలేకపోయారు. అడంబరంగాచేసిన పెళ్ళి ముగిసేసరికి అందరిమొఖాలు బిగుసుకుపోయాయే కాని విచ్చుకోలేదు. పొరుగూర్లనించొచ్చిన మేనత్తలూ, బంధువులూ నాలుగయిదు దినాలు ఉండాల్సిన వాళ్ళు ఒకటి రెండ్రోజుల్లోనే తిరుగు ప్రయాణము కట్టారు.

'కాలంమారిపోయింద్రా సిన్నోడా. మనుషులు మారిపోయినార్రా,' అని చుట్ట మరొక దమ్ము పీల్చాడు. 'ఈ రోజులకి ఆ రోజులకీ ఎంత ఎత్తేసం. అప్పుడీ డబ్బూలేదు. యీ కక్కూర్తీలేదు. ఏఁవిటో యీ డబ్బ యిలాఁగ పెరిగిపోతున్నాది. దానెనకపడి మనుషులు కూడా సెడిపోతున్నారు. ఈ నర్సయ్య గాడికి ఏఁవిటి లోటయింద్రా-కూతుర్ని ఆ పెద్దింటోళికివ్వాలి. మనిషి మంచీ, బతుకు మంచీ సూడకండా. సిన్నోడా యిను యీరబ్రెమ్మం సెప్పిందంతా జరిగే తీరుతాద్రా. ఏదీకాకుండాపోదురా. 'ఆడదాయి రాజ్జెం ఏల్తాదన్నాడు. ఏల్తన్నాది. అరిజనులు కోవిల్లో పూజలు సేస్తాన్నాడు. సేస్తన్నారు. వాయీవరసలు పోతాయన్నాడు. పోతున్నాయి. నాయినా, నేనయితే పెద్దకాలమోడిని. లావుకాలం బతకను. నీవు చిన్నోడివి. నాలుక్కాలాలు బతుకుతావు. నీ కళ్ళతో ఈ లోకం తీరంతా సూస్తావు. అప్పుడు నా మాట మతిలేసుకుంటావు. మా సిన్నప్పుడు యీ సిన్మాలెరుగుదుమా? ఈ రైలుబళ్ళున్నాయా ? ఈ ఇమానాలు సూసినామా ! ఈ వోట్లు గొడవ మాకు తెలుసునా—ఇదంతా ఏమవుతాదో".

జగ్గన్న ఎవరివేపూ చూడకుండానే నిద్రమత్తుకి కళ్ళు మూతలుపడుతుంటే మనసు, గుండెతోపట్టుకుని చెప్తున్నాడు. అప్పుడప్పుడు మాటల మధ్యలో గొంతు రెండు మూడు స్వరాలుగా చీలిపోతున్నది.

జగ్గన్నచెప్పిన వీరబ్రహ్మం సూక్తులు అర్థమయినట్టు పందిరి బయటినించి చొట్టోడు 'కాకితాలొచ్చినాయి ఎండి రూపాయి లెగిరిపోయినాయి. కాకితాలు కాకితాల్లాఁగే ఉన్నాయి. కడుపుమంట కడుపు మంటలాఁగే ఉన్నాది.' వాడి పాట వాడు పాడాడు. 'లోకం జగ్గన్న తాతా లోకం' అన్నాడు పిచ్చి నవ్వుతో.

చెరకుగానుగ తిరుగుతున్నది. ఎడ్ల, అదురుతున్నాడు పద్నాలుగేళ్ళ దాసు. మెషిన్ కిర్రూ కిర్రూ రాగాలుతీస్తున్నది. చలి మెల్లగా విజృంభించింది.

'చెరుకు మోపెయ్యిరో' జంగమయ్య అరిచాడు మెషిన్‌దగ్గర్నించి.

* * *

టార్చిలైట్ వెలుగులో నడుస్తూ వచ్చాడు నర్సయ్య. ఒకసారి పందిరి కింద అన్నీ వెతికిచూసాడు. మెషిన్ దగ్గర కూచున్న జంగమయ్య పచ్చి దొంగ. ఆడు సందు దొరికితే ఏదోఒకటి మాయ చేస్తాడు. ఈ జగ్గన్న యింటి మనిషి అనుకుంటే కూచున్నకాడ కునికిపోతాడు. ఆ చిన్నోడు ఎద్దు. ఎద్దులాగుపనిచేస్తాడేకాని బుర్రలేదు. ఎక్కడ ఏ వస్తువుపోయినా ఆడికి తెలీదు. ఇక చొట్టోడంటే ఆడి బుర్ర గట్టిదేకాని

టక్కరి. ఇలాంటి మనుషుల్తో నర్సయ్య తన వ్యవసాయం పనులు చేయించుకోవాలి. అందుకే నర్సయ్య గిరకసాల విడవడు. తిని రావటానికి ఇంటికి అర గంట కిందట వెళ్ళాడేకాని అతడి మనసంతా ఇటేపే ఉంది.

తూర్పుకి ఎదురుచేసి గిరకసాల పందిరి. మూడువేపులా ఆకుల్తో కొమ్మల్తో తడికల గోడలు. పైనఆకులు కొమ్మలు కప్పారు. ఆ పందిరిలో ఒక పక్క కొత్త బెల్లంకుండలు జేగురు రంగుతో. ఏభై అరవైకి పైగా బెల్లం నింపిన తరిగూనలు. ఒకపక్క మంచం. పందిరికి తూర్పున మనిషిలోతున పెద్ద నుయ్యి సైజు పొయ్యి. ఆ పొయ్యికి తగినట్టు పెద్ద పెనం. పొయ్యికి దగ్గర్లోనే చెరకుపానకం నిలవఉంచే రామ్మెత్తు పెద్దగూనలు. ఇంకా చాపలు, దుప్పట్లు, గడ్డీ, పెట్రొమాక్స్ లైట్ వెలుతురు. అదీ గిరకసాల.

బెల్లం వంట ఇంకా పదిహేనుదినాలు సాగుతుంది. అంతవరకు ఆ పందిరే నర్సయ్యకి ఇల్లు.

నర్సయ్య మంచంమీదకూచున్నాడు.

దాను చేతిలోని కర్రందుకుని ఎడ్లను అదురుతున్నాడు చిన్నోడు. దానుఇంటి వేపు పోతుంటే నర్సయ్య పిలిచాడు. 'ఇంటికాడ మందు మాత్రలు ఏసుకోవడం మరిచిపోయినాను. రంగయ్యతో పంపు నాయనా' అని కొడుకుతోచెప్పి పంపాడు.

కూతురు పెళ్ళిచేసిన కాడినించి నర్సయ్య మనసుకి శాంతి లేకుండా పోయింది. రెండెకరాల పల్లపు భూమి కొన్నాడు. ఆ రిజిస్ట్రేషన్ చేసుకోటానిక్కూడా తీరిక చిక్కదు. బెల్లం పని దగ్గర ఉండకపోతే ఇదేమయిపోతుందో అన్న అనుమానం. అన్నిటికీ ఒంటరి వాడు. కూతురుకు పెద్దింటి సంబంధం చేసిన సంతోషం లేకుండాపోయింది.




'ఏ నూతిలోనో గోతిలోనో పడిచస్తాను గాని బతకన్రా అయ్యా. ఆ మేడల్లో నేను బతకన్రా. నా బతుకు బుగ్గి సేసినావురా అయ్యా' అని ఏడ్చింది. కూతురు ఏడుపు మనసుకు చీడపురుగులా పట్టింది.

'సుబ్బులు తిన్నాదా?' జగ్గన్న కళ్ళు మూసికొనే, ఓ పక్క నిద్దర కుమ్ముకొస్తుంటే అడిగాడు నర్సయ్యని.

మాట పెకల్లేదు. జగ్గన్న అంటే నర్సయ్యకి బెరుకుఉంది. ఈ పెళ్ళి చేస్తున్న కబురు తెలిసినప్పుడు జగ్గన్న 'ఆలోచించి మాటియ్యి' అన్నాడు. నర్సయ్య ఆలోచన వేరేదారిలో వెళ్ళింది. వూళ్ళో తన పరపతి పెరుగుతుంది. పాతికేళ్ళుగా రెండు కుటుంబాలకీ మధ్య ఉన్న వైరం పోతుంది. కోర్టులు పోలీసు గొడవలు తగ్గిపోతాయి. ఈ పట్టుదలల్తో చాలా డబ్బు ఖర్చయింది. వడ్డీవ్యాపారం మీద పెట్టిన డబ్బు వసూలుతోపాటు భూములు దక్కుతాయి. వీటితో మనశ్శాంతి ఏర్పడుతుందనుకున్నాడు నర్సయ్య.

'దాని మనసు బోదపెట్టాలిగాని నీవు నరకుతాను సంపుతాను అంటె అవుతాదిరా' అన్నాడు జగ్గయ్య.

దానికేం తక్కువయింది. దానికేం తక్కువ చేసినాను. ఆస్తీ డబ్బూ, పేరూ ఉన్న ఇంటికి మనువు కుదిర్చితే ఏం తప్పు చేసినానని దానికా ఏడుపు. అల్లుడు నడకంటావా—ఈ వూర్లో ఎవరున్నార్రా శ్రీరాములూ. ఆడిది బయట పడింది. మిగిలినవాళ్ళది బయటపడ లేదంతే. వయసులో ఉన్నాడు పెళ్ళి కాకముందు తప్పు అడుగేస్తే—అది బతుకంతా ఉంటాదా—ఈ ధోరణిలో పోతాడే గాని కూతురు ఎక్కడ దెబ్బతిన్నదో అన్నసంగతి ఎంతకీ ఆలోచించడు. ఎంతో పోటీపడి యీ సంబంధం ఔననిపించారు. రకరకాల ఎత్తులూ పైఎత్తులూ ఆలోచిస్తేగాని ఇది సాధ్యంకాలేదు. ఇంత శ్రమపడిచేసిన పెళ్ళిని మొండి పట్టుదలతో కూతురు కాలదన్నుతుంటే నర్సయ్యకు కోపం వొచ్చింది. ఆ కోపంలోనే ఒకటి రెండుసార్లు చెయ్యిచేసుకున్నాడు. 'చస్తానుచస్తానుఅంటున్నావు. చస్తే చావు. వొల్లకాటికి తీసికెల్లి బూడిద చేసేసి సెర్లో నాలుగుమునుగులుమునిగేసి నీ రుణం తీరిపోయిందనుకుంటాము' అన్నాడువిసిగిపోయి. తర్వాత కూతురు ముఖం రెండు దినాలుగా చూడలేదు.

బెల్లం ఉడుకుతున్న తీయని వాసన. ఎడ్ల అడుగుల చప్పుడు. చెరకురసం బకెట్‌లో పడుతున్న ధార. నక్షత్రాలు

నిండిన చలి ఆకాశం. మండుతోన్న పొయ్యి. చెరకుతొక్కు-కాస్తున్న చొట్టోడు కూచునే కునుకుతున్న జగ్గన్న. ఎడ్లను అదురుతూ మధ్యమధ్య బకెట్ నిండి నప్పుడు రసం గూనల్లో పోస్తున్న చిన్నోడు. మెషిన్‌లో చెరకు కుడువు తున్న జంగమయ్య. దూరాన అక్కడా అక్కడా గిరకసాలల సందడి. చిన్నగా నిద్ర ఊపుతుంటే మంచంమీద నడుం వాల్చాడు నర్సయ్య.

* * *

'నీకు రెండు కాళ్లూ ఉంటే లోకాన్ని మింగేసుందువురా' అన్నాడు జగ్గన్న. ఒక్క కాలుతోనే చొట్టోడు చేస్తున్న పను లకు ఆశ్చర్యపోయినట్టు. విచ్చినవ్వు నవ్వాడుచొట్టోడు.జంగమయ్యతలనొప్పి అని కడుపులో ఏమిటో అయిపోతున్న దనిచెప్పియింటికెళ్ళిపోయాడు. చొట్టోడు మిషన్‌దగ్గర కూచుని పన్చేస్తున్నాడు. జగ్గన్న చెరకురసం తీసి గూనల్లో పోస్తు న్నాడు.

రాత్రి దించిన చల్లారిన బెల్లాన్ని కొత్త కుండల్లో నింపుతున్నాడు నర్సయ్య. తెల్లని తెల్లారింది. పనుల్లో దిగింతర్వాత చలికూడా పోయింది. చిన్నోడు ఎడ్లను అదుర్తున్నాడు. చొట్టోడు పరాచకాలు చేస్తున్నాడు.

పరుగుపరుగు నొస్తున్న నరసయ్య చిన్నకొడుకుని చూసాడు చిన్నోడు. చెరుకుపొలంగట్టున వస్తున్నాడు.

'సుబ్బారావు యానికో పరిగెత్తొస్త న్నాడు' అన్నాడు.

నర్సయ్య వినివించుకోలేదు. జగ్గన్న మాత్రం నిలబడి అటువేపు వెతికి చూసాడు. రంగయ్య చెరుకువిప్పి పొలంలో ఒకమూల ఎండేస్తున్నాడు. అడ్డంగా పొలాల్లోంచి ఫర్లాంగుదూరంలో వూరు. ఆ దూరానికే సుబ్బారావు అలసి పోయి తిన్నగా గిరకసాల్లో అయ్యదగ్గర ఆగి ఒకసారి ఊపిరి బిగపట్టి 'అయ్యా, మరేమో అమ్మ—నీకు తీసుకొని-రమ్మ న్నాది-మరేమో — సుబ్బప్ప- కనిపించ లేదు' అని మధ్యమధ్య ఆగిపోతూ చెప్పాడు.

నర్సయ్య ముఖం రంగు మారిపోవటం చూసాడు జగ్గన్న.

'జగ్గన్నా' అని పిలిచి 'రారా' అని కొడుకుతో వూరువేపు నడిచాడు. చిన్నో డికి పనప్పజెప్పి నర్సయ్యతో కలిసాడు జగ్గన్న.

'చూడు సుబ్బులు ఎంతపని చేసిందో. ఇంటిలో లేదంట.' అని ఏడుపుగొంతు పెట్టాడు. వూళ్ళో జనమంతా తనకోసం గుమిగూడి చూస్తున్నట్టు అయింది. కూతురు తన బతుకుని పరువుని నవ్వుల పాల్చేసింది. తనకు శత్రువయింది. ఏ నూతిలో పడిందో. ఏ చెర్లో పడిందో. అది పెట్టిన శోకాలన్నీ గుర్తుకొస్తు న్నాయి. ఈ సంగతి దాని అత్తకీ మామకీ తెలుస్తుంది. బంధువు లందరికీ తెలుస్తుంది. ఫలానా నర్సయ్య కూతురు నూతిలోపడి చచ్చిపోయిందని చెప్పుకుం టారు. ఇష్టంలేని పెళ్ళి చేసినందుకు చచ్చి పోయిందని అంతా అనుకుంటారు.

వీధిలో నర్సయ్య ఇంటిముందు జనం పోగయ్యారు. ఆ మనుషుల మధ్య ఇంకా పచ్చదనం పూర్తిగా ఎండిపోని పెళ్ళిపందిరి కన్పిస్తున్నది. సుభద్ర శవాన్ని తెచ్చి ఇంటిముందు వేసారేమో అన్పించింది. దాన్ని చూస్తూ జనం చుట్టు ముట్టారనిపించింది.

అప్పటికే వూరుచుట్టూ ఉన్న నూతులూ చెరువులూ వెతకటానికి కొంతమంది పోయారు.

* * *


లక్ష్మణమూర్తి టీ కాచుకుంటున్నాడు కుంపటిమీద. రేడియోవార్తలు వింటాని కొచ్చాడు జగన్నాధం. ఈజీచేర్లో కూచుని ట్రాన్‌సిస్టర్‌ని ఒడిలో పెట్టు కుని ఆన్‌జేసి 'డ్రాయింగ్ మేష్టర్ ఏడీ' అని అడిగాడు.

'వూరు కెళ్ళాడండీ'అన్నాడు లక్ష్మణ మూర్తి. ఈఏడే కొత్తగా వచ్చి సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్‌గా హైస్కూలులో చేరాడు లక్ష్మణమూర్తి. అతడు చేరిన వారం పదిదినాల్లో డ్రాయింగ్ మేష్టర్ చేరాడు. ఇద్దరూ కుర్రాళ్ళు. జగన్నాధా నికి కుర్రాళ్ళతో తిరగడం ఇష్టం. న్యూస్ పేపర్ రాజకీయాలు తెలిసిన డ్రాయింగ్ మేష్టర్‌తో జగన్నాధంకిమంచి కాలక్షేపం. లక్ష్మణమూర్తిది అంతా క్రమశిక్షణ. తెల్లారే వ్యాయామం,చలిలో చెర్లో స్నానం, దేముళ్ళముందు ప్రార్థన, తర్వాత సొంతవంట. కనీసం సినిమాల గుర్తించి కూడా మాటాడడు. వారందినాల నించి షేవ్‌చేసుకొని లక్ష్మణమూర్తి కొత్తగా కనిపిస్తున్నాడు.

'ఏవిఁటి సడన్‌గా వెళ్ళిపోయాడు చెప్పాచెయ్యక?'

పేరుకు తెలుగుమేష్టరే అయినా చూట్టానికి సైన్సుమేష్టర్‌లా ఉంటాడు జగన్నాధం.కుర్రటీచర్లు ధోతీ,కండువా, పొడుం డబ్బా, నూటపదకొండూ తెలుగు మేష్టరుకు తప్పనిసరి అని ఏడిపిస్తారు. మీ సరదా తీరాలంటే ఆ వేషండీయావో వచ్చినరోజునవేస్తాలెండి అని వాళ్ళకితగి నట్టుగా ఆటలాడుతాడు జగన్నాధం.

ఏం చెప్పాలో తోచలేదు. జగన్నాధం గారితో చెప్పు యీ సంగతి అని గోపాలం చెప్పాడు. చెప్పడానికి ధైర్యం చాలటం లేదు. అంతేకాదు. భయంగా వుంది. సుభద్రని తీసుకుని ఎక్కడికో రాత్రి పారిపోయాడు. గోపాలంచేసిన పని నచ్చలేదు. తోడుగా తనని స్టేషన్ దాకా రమ్మన్నాడు. తను ఆ సహాయం చేయలేకపోయాడు. ఆ వూరు పొలి మేరలుదాటితే దార్లుతెలీవు. పైగాభయం. భయంతో గోపాలంని ఆ పని చేయొద్ద న్నాడు. ప్రమాదం అని వారించాడు.




ఇంట్లో ఆ పిల్ల ఉన్నంతసేపు భయంతో వణికిపోయాడు. ఆ పిల్ల తెగింపుకి ఆశ్చర్యపోయాడు. గోపాలం లెక్కలమేష్టరు ఆదుకుంటాడేమోనని వెళ్ళాడు. అదీ కుదరలేదు. టార్చిలైట్ చేతపట్టుకుని ఓ చేత్తో ఆ పిల్ల చేయిపుచ్చుకుని పెరట్లో పొలాల్లోంచి దక్షిణ దిక్కుగా పోయారు. వాళ్ళు వెళ్ళిపోయినా లక్ష్మణమూర్తి భయం తగ్గలేదు. రాత్రంతా తర్వాత నిద్రపట్టలేదు. తెలిసి జనంవచ్చి ఇంటిముందు పడతారేమోనని భయం.

ఆ మట్టిగోడల పూరిల్లు పూరుకు పడమరగా ఉంది. కొండగాలులు తిన్నగా వచ్చి ఇంట్లో దూరుతున్నాయి. ఏడు గంటలయినా ఇంకా రొజ్జగాలి వీస్తూనే ఉంది.

లక్ష్మణమూర్తి మాటాడకముందే 'నర్సయ్య కూతురుసంగతి తెలిసిందా' అని అడిగాడు జగన్నాథం.

'నూతులన్నీ వెతుకుతున్నారు' అన్నాడు మళ్ళీ తానే.

చలికి అక్కడ కూచోలేక కుంపటి ముందు కొచ్చాడు. రేడియోలో వార్తలొస్తున్నాయి. కుంపటి వెచ్చగా ఉంది. మరుగుతున్న నీళ్ళలో టీపొడి వేసాడు లక్ష్మణమూర్తి. ఆ వాసన చాలాబావుంది.

జాదవ్‌పూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ని నక్సలైట్లు చంపేసారు. శ్రీమతి గాంధీ దేశంలోని మతవాద మితవాద శక్తుల ఉద్దేశాలని ఖండించారు. రాజభరణాల విషయంలో ఒక ఒప్పందము కుదరవచ్చునట. సామాన్య ప్రజల జీవిత పరిస్థితులను మెరుగుపరచటానికి కొత్త కాంగ్రెస్ పోరాడుతుందట.

డ్రాయింగ్‌మేష్టరు సంగతి జగన్నాథం మర్చిపోయి 'ఎన్నిక లెన్నిక లని జనాన్ని చంపేస్తున్నారు ఈ రాజకీయ నాయకులు' అని వార్తల్లోని ప్రోపగండాని భరించలేకపోయాడు. అతనికి ఎలక్షన్లంటే కోపం. ఒకసారి ఎలక్షన్ల సందడిలో వాళ్ళ తరఫున ప్రచారం చేయలేదని పెద్దలు కొందరు అతడిని ఆ స్కూల్‌నుంచి బదిలీ చేయించారు. ఇంకోవూళ్ళో ఎలక్షన్లలో నిలబడుతున్న వ్యక్తిని విమర్శించినందుకు అక్కడ వాళ్ళ గ్రూపొళ్ళు కొట్టారు. ఇంకోసారి వేరే పార్టీవాళ్ళతో మాడాడినందుకు ఇల్లు ఖాళీ చేయమన్నాడు ఇంటియజమాని. హెడ్మాష్టర్ ప్రచారంచేస్తున్న మతోన్మాదాన్ని ఖండిస్తే చివరికి ఈ వూరు పనిష్మెంట్‌గా పంపించారు. రాజకీయ స్వాతంత్ర్యమన్నా, ఓటు స్వేచ్ఛన్నా జగన్నాథానికి భయమేర్పడిపోయింది.

లక్ష్మణమూర్తి టీ ఇచ్చాడు.

రాత్రంతా ఎముకలు కొరికే చలి. ఆ చలిలో ఆ ఇద్దరూ ఎక్కడికి పోయారో. దారిలో ఎలుగ్గొడ్డులభయం. ఇద్దరికీ దారి తెలీదు. ఏమయ్యారో తెల్లారేసరికల్లా ఊరంతా సుభద్ర నూతిలో పడిపోయిందన్నవార్త. చెర్లో స్నానంచేస్తున్నప్పుడు విన్నాడు. ఆ వార్త విని నమ్మిన జనాన్ని చూస్తుంటే లక్ష్మణమూర్తికి మరింత భయమయింది.

టీ వెచ్చగా రుచిగా ఉంది. కుంపటి దగ్గరే తనముందే కూచున్న జగన్నాథంతో 'సుభద్ర చచ్చిపోలేదు.' అన్నాడు లక్ష్మణమూర్తి.

జగన్నాథం కుతూహలంగా చూసాడు.

'డ్రాయింగ్‌మేష్టరూ—' అని ఆగిపోయాడు లక్ష్మణమూర్తి.

అతడి ప్రక్కనున్న ట్రాన్‌సిస్టర్ డ్రాయింగ్ మేష్టర్‌ది. అది అక్కడే విడిచాడు. పెట్టె బెడ్డింగ్ అన్నీ గదిలో ఉన్నాయి. ఏమీ తీసుకుపోలేదు. ఒక్క టార్చిలైట్ మాత్రం తీసుకుపోయాడు.

'భయంగా ఉందండీ. ఇది అటు తిరిగి ఇటుతిరిగి నా మీది కొస్తుందేమో.'

జగన్నాథం ఆలోచనల్లో పడ్డాడు. అతడికీ అదే భయం, అనుమానం కలిగింది. ఊళ్ళల్లో పెద్దమనుషుల పెత్త

నాలు రుచి చూసినవాడు. ఏంచేయాలో ఏం చెప్పాలో తోచలేదు.

ఆ ఇంటికి పడమరగా వంటకోసేసిన వరిపొలాలు! మధ్య మధ్య చెరకు తోటలు. వాటి మధ్యనించి పోతున్న వాగు. వాగు పొడవునా గట్టున చెట్లు. ఆ వెనక ఇంకా పడమరగా మామిడి తోటలు. అవి దాటితే అడవులతో నిండిన మహేంద్రగిరి కొండలవరస. అక్కడ ఆగిపోయింది. జగన్నాథం చూపు.

* * *

ఊరుకు దక్షిణంగా ఉన్న అయిదారు ఇళ్ళనీ చాకలివీధి అన్నారు. ఆ ఇళ్ళన్నీ దక్షిణంగా ఎదురుచేసిఉన్నాయి. వాళ్ళ వాకిళ్లకు ఆనుకునే పెద్దింటివాళ్ళ చెరకుతోటలున్నాయి. ఆ చెరకు తోటల వెనకనించి వాగు వంపులు తిరిగి పోతున్నది. ఆ పక్క అంతా దట్టంగా చెట్లు డొంకలూ ఉన్నాయి.

నూకరాజు వాకిట్లో లేత పసుప్పచ్చని చీరలు ఎండేసినట్టుగా ఉదయం ఎండ పడింది. రొజ్జగాలిలో వాకిటకూచుని నూకరాజు ఇస్త్రీ పెట్టెలో నిప్పు రాజేస్తున్నాడు.

నూకరాజుకి నిద్రగా ఉంది. కళ్ళ మీదికి నిద్ర ముంచుకొస్తున్నది. రాత్రి నాలుగుమైళ్లు నడిచివెళ్ళి తెల్లారకముందే ఆ దారంతా నడిచి వెనక్కి వచ్చాడు. సుభద్ర, డ్రాయింగ్ మేష్టర్లకి తోడుగా అక్కడ ఒక గంట కూచున్న తర్వాత రైలొచ్చింది. నిద్రలేని అలసటతో బరువుగా ఉంది వొళ్ళు. నిద్రపోవాలని ఉంది. ఉతికిన బట్టలు మేష్టర్లవి ఉన్నాయి. అవి ఇవ్వాలి. మునసబుగారి పిల్లల బట్టలకోసం నిన్న రెండు సార్లు తిరిగాడు వాళ్ళ కంబారి. అవి ఇస్త్రీ చెయ్యాలి. హెడ్మాష్టరుగారి బట్టలు అని తెల్లారే ప్యూన్ వచ్చాడు. పీ ఎల్ డబ్ల్యు టౌన్ వెళ్తాడట.

అరుగుమీద ఉతికిన బట్టల్ని చలువ చేసాడు. పెట్టె వేడెక్కింది. గ్లాసులో వేళ్ళు పెట్టి నీళ్ళుతీసి పెట్టె వేడి చూసాడు. మునసబుగారి షర్టుతీసి ఇస్త్రీ తోముతున్నాడు.

నూకరాజుకు పెళ్లం గుర్తుకొచ్చింది. ఇంట్లో ఉండమని శారదకి చెప్పాడు. ఆ పిల్ల ఉండలేదు. అత్తతోపాటు రేవుకు వెళ్ళింది.

నూకరాజు నాలుగు షర్టులు పూర్తి చేసి అయిదోది అందుకుంటుండగా చిన్నోడువచ్చి వాకిట నుంచున్నాడు.

చిన్నోడు ఆ ఇంటిమీదినుంచి నర్సయ్య పొలాలకి పోతుంటాడు. పోతూపోతూ నూకరాజు దగ్గర బీడీ ముట్టించుకుంటాడు. నూకరాజుతో చిన్నోడికి రకరకాల స్నేహమున్నది. వాళ్లిద్దరూ రెండో ఆట సినిమాకి ఆ అర్థరాత్రులు పోయి వచ్చేవాళ్ళు. ఇరుగు పొరుగు వూళ్లల్లో జాతర్లకి కలిసిపోయే వాళ్ళు. కొండకి కట్టెలకి, బొగ్గులకి పోయేవాళ్ళు. చూట్టానికి ఒకే ఎత్తుతో అన్నదమ్ముల్లా కనబడతారు. ఇద్దరివీ కండరాలు తిరిగిన వొళ్ళు. చిన్ననాటి నుంచి ఇప్పటిదాకా స్నానాల వేళకి చెర్లో వాళ్ళు రోజూ కలుస్తారు.

చిన్నోడిని చూసినప్పుడే నర్సయ్య పంపితే వచ్చాడని అనుమానం కలిగింది. నూకరాజు ముఖం ఈ రోజు కొత్తగా కన్పించింది.

'సుబ్బులు సంగతి నీకు తెలిసిందా నూకన్నా' అడిగాడు ముందునుంచుని పక్కకి చూస్తూ చిన్నోడు.

నూకరాజు నోరు విప్పలేదు.

'సుబ్బులు ఎక్కడికో పారిపోయింది. నీకు తెలుసునట. ఎవరో సెప్పినారు నర్సయ్యకి. ప్రెసిడెంట్ బావు, పెద్ద నాయిడు అంతా నర్సయ్యబాబు ఇంటి కాడున్నారు. నీకు పిలిసికొని రమ్మన్నారు' అని చిన్నోడు తను వచ్చిన పని చెప్పాడు.

నూకరాజు ఇస్త్రీ పెట్టెను పక్కకు పెట్టి 'ఇంటికాడ ఎవరూ లేరుకదా- ఎలాగరాను?' అనిగొణిగి పక్కఇంటిలో చెప్పి బయల్దేరాడు వెంట.

దార్లో నూకరాజు సంగతంతా చెప్పాడు.


నూకరాజు వీధుల్లోంచి పోతున్నప్పుడు మనుషులు చూసి వాళ్ళల్లో వాళ్లు మాటాడుకుంటున్నారు. వాళ్ళని చూసినప్పుడు ఆ ఉదయం ఆ చలిలో చెమటలు పోసాయి. పెద్ద మనుషులకు నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో తోచటంలేదు. నిజం చెప్తే ఏం చేస్తారో. అబద్ధం చెప్తే ఏమవుతుందో.

నూకరాజుకు ధైర్యం కలిగింది. మొండి ధైర్యం.

ఏం చేస్తారు. నాలుగు తిట్టారు. ఇంకా కోపమొస్తే కొడతారు. కొట్టనీ. అయినా తనేం చేసాడు. నర్సయ్య కూతుర్ని తను ఎత్తుకుపోలేదు. డ్రాయింగ్ మేష్టర్ని చూసాడు. మంచి మనిషి పక్కనే సుభద్రని చూసాడు. ఆ పిల్ల కళ్లల్లో నీళ్ళుపెట్టుకుని అడిగింది.'తోడు రారా నూకరాజూ' అని. ఆ సమయంలో మరేం గుర్తురాలేదు. వాళ్లతో బయల్దేరిపోయాడు. రైలు ఎక్కిన తర్వాత తన చేతులు రెండూ పట్టుకుని తన సహాయాన్ని జీవితంలో ఎప్పుడూ మరచిపోలేమని వాళ్ళు చెప్పినప్పుడు నూకరాజుకు చాల సంతోషమయింది.

ఇప్పుడు కొట్టారు కొట్టనీ. కొట్టటానికి ఇదొక్కటే కారణం కానక్కర్లేదు. ఏ కారణం పేరు చెప్పన్నా కొట్టొచ్చు. చంపొచ్చు. నాయిడు చెప్పుతో కొట్టినప్పుడు, మునసబు సారాకేసులో ఇరికించి పోలీసుతో తన్నించినప్పుడు వొళ్లప్పచెప్పి నిన్న హాయంగా ఉన్నట్టే ఇప్పుడూనూ.

నర్సయ్య ఇంటి ఎదురుగా వీధికి అటుపక్క పశులసాల ఉంది. పశువు




లన్నీ మేతకి తోలుకెళ్లడంతో అది ఖాళీగా ఉంది. ఎడ్లు గిరకసాల దగ్గ రుండిపోయాయి. దూడలు ఆడి ఆడి అలిసిపోయి ఒక పక్క గడ్డిలో పడు కున్నాయి.

నూకరాజు వచ్చేసరికి నర్సయ్య ఇంటిముందు జనం ఎవ్వరూ లేరు. అరుగుమీద నలుగురయిదుగురు పెద్ద మనుషులు, పంచన ఇద్దరు కుర్రాళ్ళు మాత్రం ఉన్నారు. ఆ పెద్దమనుషులు వచ్చేసరికి అక్కడ పోగయిన మనుష లంతా ఒక్కరొక్కరే అక్కణ్నించి జారుకున్నారు. అంతా ముందే అను కున్నట్టుగా నూకరాజు వచ్చీ రావడం తోనే ఆ ఇద్దరు కంబారి కుర్రాళ్ళూ వాడిని సాలలోని రోలు దగ్గరికి తీసు కెళ్ళారు. నూకరాజుని వాళ్ళు తీసుకు పోవటమే చూసాడు చిన్నోడు. అక్కడ నిలబడలేకపోయాడు. పోబోయాడు. నర్సయ్య పిలిచి ఉండమన్నాడు. నర్సయ్యమాట వినిపించుకోలేదు. తర్వాత చిన్నోడికి నూకరాజు అరుపులు వినిపించాయి. చిన్నోడికి ఆ సమయంలో అక్కడున్న పెద్దమనుష లందర్నీ ఒక పెద్దగొయ్యితీసి దాంట్లో పాతేయాలనిపించింది.

పెద్దనాయుడు ఇంకా అక్కడ అరు స్తున్నాడు. 'ఎంతమంది ఆడపిల్లల్ని పట్నాల్లో అమ్ముతావురా? ఎంతమంది కూతుళ్ళని రైళ్ళెక్కించొస్తావురా? ......కొడకా ఆ పిల్ల నెక్కడ దాసి నావో సెప్పురా. ఆ పిల్ల నేంచేసినావో సెప్పురా. ఆ పిల్ల ఏమయిపోయిందో సెప్పవేఁమిరా?' అని అలిసిపోతున్నాడు. ముందు మాటాడకుండా దొరికిన దగ్గ రల్లా కొట్టాడు. ఆ కోపంలో కర్రతో పక్కఎముకల్లో పొడిచాడు. అరుస్తుంటే నోటిలో కర్రపెట్టి గొంతులో పొడి చాడు. పెద్దనాయుడుకి తలతీసేసినట్టుంది కోడలు పారిపోయిన వార్త. దాన్నికప్పి పుచ్చటానికి తన పరువు కాపాడుకో టానికి వాడి వొళ్ళు వొలిచేయటంకంటె ఇంకోదారి కన్పించలేదు. అప్పటికి మూలిగి మూలిగి నూకరాజు తలవేలాడి పోయింది.

* * *

శారదని చూట్టానికి వచ్చినట్టుగా అక్కడ ఆగిపోయింది వాగు. ఆ వాగులో కొచ్చి దాక్కుని తెల్లని మేఘమూ, నీలం ఆకాశమూ శారద కళ్ళను చూస్తున్నాయి. వాగుగట్టున చెట్లూ, తీగెలూ, పూలూ, గడ్డీ శారద కోసం రాగాలు తీస్తున్నాయి.

శారద అత్తవారింటికి కాపురాని కొచ్చి ఇంకా పదిహేను దినాలు కాలేదు. ఇప్పుడిప్పుడే శారద ఈ ఊరు గాలికీ ఎండకీ పొలాలకీ వాగులో నీళ్ళకీ చెట్లకీ చేలకీ అలవాటు పడుతున్నది. ఇప్పు డిప్పుడే శారద నూకరాజు చూపుల అల్లరికీ మాటలబాణలకీ వొంటివాసనలకీ వెలుతురొచ్చి మేల్కొల్పిన జగంలా మేల్కొంటున్నది. ఇప్పుడిప్పుడే శారద తల్లినీ తండ్రినీ, కన్న ఇంటినీ, అక్కడ మనుషుల్నీ, తనని పెంచి పెద్దచేసిన గతాన్నీ మరచిపోతున్నది. ఇప్పు డిప్పుడే బతుకంటే శారదకి చాలా ఇష్ట మవుతున్నది. ఇప్పుడిప్పుడే శారదకి మనుషులంటే నమ్మక మేర్పడు తున్నది.

కూతురుని అత్తవారు తీసుకుపోతే తనకి తోడెవరూలేరని శారదని తెచ్చింది నూకరాజు తల్లి. ఆ పక్కన ఇంకో రెండు రేవులు. అక్కడా మనుషులు. చుట్టూ కొండలు. పచ్చగా దట్టంగా. అయినా అక్కడ మనుషుల్లేని లోకంలా ఉంది.

అత్త అందించే ఉతికిన బట్టల్ని

అందుకుని వడ్డున ఎండేస్తున్నది. ఆ సమయంలో నూకరాజు సంగతి తెలిసింది.

ఎక్కడిపని అక్కడే వదిలేసి నూకరాజు తల్లి నా కొడుకో నా కొడుకో అని ఏడుస్తూ పరుగెత్తింది. చిన్నపిల్ల కోడలు భయపడిపోతుందన్న ఆలోచన కూడా లేకుండా ఏడుస్తున్నది. అత్త వెనక శారద పరుగెత్తింది. ఆ వెనక ఒకరిద్దరు పరుగెత్తారు. నా కొడుకును చంపేయకు దేముడో, నా కొడుకును రక్షించు దేముడో అని ఏడుచుకుంటూ నర్సయ్య ఇల్లుచేరింది. అప్పటికక్కడ జనం నిండా గుమిగూడారు. వూళ్ళోని పెద్దలూ పిల్లలూ వచ్చారు.

సాల్లో రాటకి కట్టేసిన కొడుకును చూసింది. కొడుకు దగ్గర కెళ్ళలేదు. వాకిట నర్సయ్యని చూసింది. నర్సయ్య కాళ్ళమీద పడిపోయింది. నాయినా నీవు బగమంతుడవు. నాయినా నీవు పరమాత్తుమడవు. నాయినా నా కొడుకును రచ్చించు. అయినా నూకరాజు తల్లికి ఏం అనుమానం కలగలేదు.

'ఇంకెక్కడ నూకరాజు'అని ఎవరో గొణిగారు.

అయినా ఆ మాట తల్లి చెవుల్లో పడలేదు.

అక్కడ గూమిగూడిన జగన్నాధం ఆలోచనల్లో పడ్డాడు. ఇది హింసా, అహింసా? అని. ఇంతమంది ఉండి ఒక్కడూ నోరెత్తడేం అని ఇంకో మేష్టరు ఆశ్చర్యపోతున్నాడు- ఈ పెద్దలంతా ఇప్పుడేం చేస్తారు. అని లక్ష్మణమూర్తి అడుగుతున్నాడు. ఆ ప్రశ్నవిని డ్రిల్లుమాష్టరు – నూతిలోపడి ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయాడని శవపంచాయితీలో రాసేసి శవాన్ని కాల్చుకోటానికి ఇచ్చేస్తారంటున్నాడు. ఆడికోడలు నూతిలోపడి చచ్చిందన్నారు. అది నిజంగా చస్తే ఎవళ్ళని చంపేవాడో యీ పెద్దనాయుడు. డబ్బుకు ఆశపడి సవాలక్ష రోగాల అల్లుడ్ని సేసినాడు. ఆ రోగాల అది సస్తే—ఎవళ్ళని సంపేవాళ్ళో ఈ పెద్దమనుషులు. ఆ పిల్ల చవ్వకుండా బతికిపోయిందని ఈ లంజకొడుకు నూకరాజుని బాదిబాది పక్క ఎముకలు ఇరగబొడిసి గొంతులో కత్రతో పొడిసి చంపాడు. పండనీ, పండనీ. పాపాలన్నీ పండనీ. పూర్తిగా పండితేనేగాని పండు రాలదు. అని మరొక మనిషి దుఃఖానికి బదులు కసిగా అంటున్నాడు.

అయినా ఆ తల్లికి అర్థం కాలేదు.

అక్కడికి అందరు మనుషులమధ్యకి శారద వచ్చింది. కరిగిపోతున్న నీడలా ఉన్నారు. అందరూ అలుక్కుపోతున్నారు. వెతికి వెతికి మొగుణ్ని చూసింది. ఎక్కడా కనిపించలేదు. కళ్లు తుడుచుకుంటున్నా పొంగివచ్చి వెలుగంతా అలుక్కుపోతున్నది. లోకమంతా చివికిపోతున్నది. చివరికి రాట దగ్గర చూసి గుర్తుపట్టలేకపోయింది. నెత్తురు చారల రంగుచూసి జడిసిపోయి కెవ్వున కేకేసి అక్కిణ్నించి ఆగకుండా అటు తూర్పుదిక్కు పరుగుతీసింది. కిరాతకులు తరుముకొస్తున్నట్లు పొలాల్లోంచి, గట్లమీంచి, ముళ్ళుగుచ్చుకుంటున్నా, జారిపడిపోతున్నా ఆగక పరుగెత్తింది. తన అమ్మా, అయ్యా దగ్గరికి. తన అన్నా తమ్ముళ్ళ దగ్గరికి. తన తోడూ నీడా దగ్గరికి. తన బంధువుల దగ్గరికి. తన బలగం దగ్గరికి. తళతళ మెరిసే కత్తులు పట్టుకుని, శూలాలు పట్టుకుని, బల్లేలు పట్టుకుని, బాణాలు పట్టుకుని మళ్ళీ ఆ వూరెళ్ళి తన మొగుణ్ని కాపాడుకోవాలనిపించింది శారదకి.

* * *

మునసబు తమ్ముడు ఫస్టుక్లాసు మేజిస్ట్రేట్ గా ఉంటున్నాడట. అక్కడికి ఒక మనిషిని పంపించారు పెద్దమనుషులు. పెద్దనాయుడు అక్కకొడుకు సర్కిల్ ఇన్స్పెక్టరు. అక్కడికొక కబురెళ్ళింది. నర్సయ్య బావమరది ఆడ్వొకేటు. ఒక మనిషిని అటు పంపించారు. స్వయంగా సర్పంచ్ ఎమ్మెలేస్‌ని తీసుకుని బయల్దేరాడు.

సాక్షులు మాత్రం ఇంటికిపోయి నూకరాజుని గుర్తుతెచ్చుకుని, శారదను గుర్తుతెచ్చుకుని, నూకరాజు తల్లిని గుర్తుతెచ్చుకుని ఆ పూటకి తిళ్లు తినలేకపోయారు.

